కథ

# 'ఉచితం' - అనుచితం

- భమిడిపాటి సోమయాజి

ఉదయం పావు తక్కువ ఏడవుతోంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషనంతా చాలా హడావిడిగా వుంది. ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాం నంబర్ రెండులో వుందని ఎనౌన్స్‌మెంట్. కాఫీ టీలు అమ్మేవాళ్ల హడావిడి.

విండో సీట్ ఆక్రమించిన వామనరావ్, చాలా ఆత్రంగా కంపార్ట్‌మెంట్ తలుపు వైపు పదేపదే చూస్తున్నాడు. అతని ఆదుర్దా చూసిన వాళ్లు, "ఈయనతో కలిసి ప్రయాణం చెయ్యవలసినవాళ్లెవరో యింకా రాలేదు కాబోలు" అనుకుని జాలిపడ్డారు.

మళ్లీ తలుపుకేసి చూశాడు. ఎవ్వరూ ఒక్క వార్తాపత్రికైనా తేలేదు! ఈ రోజు లేచిన వేళావిశేషం బాగా లేదు. ఆఖరికి, ఓ పత్రిక మనమే కొని చదవ్వాలసివస్తుందేమో అనుకున్నాడు. ఇంతలో దేవుడు "నేనున్నాను, నీకెందుకు చేతిచమురు బాగోతం?" అని చెప్పినట్లుగా, ఓ చేత్తో పెద్ద సూట్ కేసూ, రెండో చేత్తో ఓ వార్తాపత్రికా పట్టుకుని, ఓ మహానుభావుడు కంపార్ట్‌మెంట్‌లో ప్రవేశించాడు.

"హమ్మయ్య! వచ్చావా నాయనా!" అనుకున్నాడు వామనరావ్.

తన చేతిలోని ఆ సూట్ కేస్ పైన పెట్టబోతూంటే, "అంత బరువున్న సూట్ కేస్ పైకి ఎత్తడం కష్టమండీ, మీ చేతిలోని పేపర్ నాకిచ్చేసి, రెండు చేతులతో దాన్ని సీటు కింద తోసెయ్యండి" అని, ఆ పేపర్ స్వీకరించాడు వామనరావ్.

"ఎవరి కాళ్లకైనా తగుల్తుందేమోనని, పైన పెడుతున్నా!" అన్నాడతను.

"తగుల్తే తగల్నివ్వండి, కాళ్లకీ, చేతులకీ ఏం తగలకుండానే ప్రయాణలైపోతాయా? ఈ సూట్ కేస్ గురించి మిమ్మల్నేమైనా అంటే రెండు తగిలిస్తాను."

"ఒకటి తగుల్తే, రెండు తగుల్తాయన్న మాట! అంటే రెట్టింపు!" అనుకున్నాడు ఆ ప్రయాణికుడు.

వామనరావ్, పేపర్ క్షుణ్ణంగా చదువుతున్నాడు. ఆ పేపర్ వాపస్ అడుగుతే, రెండు తగిలిస్తాడేమోనని గమ్మని కూర్చుండిపోయాడు, ఆ పేపర్ ఓనర్. కాజీపేట వచ్చేసరికి ఆ దినపత్రిక చదివేశాడు. ఎవరైనా మరొకపత్రిక కొని తెస్తే బాగుండుననుకున్నాడు.

దేవుడు లేడా? ఇంతలో ఒకతను కొననే కొన్నాడు.

"ఆ మిగిలిన చిల్లర జాగ్రత్తగా తీసుకోండి, పేపర్ నాకివ్వండి, డబ్బు లెక్క పెట్టుకోడానికి వీలుగా వుంటుంది" అని ఆ పేపర్ చదవడం మొదలెట్టేశాడు, వామనరావ్. ఓ అర్ధగంట తరువాత, "కావలిస్తే సప్లిమెంట్ యిస్తాను, చదువుతారా?" అన్నాడు వామనరావ్.

"నేను కొన్న పేపర్, వీడు తీసుకోవడమేమిటి, కావలిస్తే నాకు సప్లిమెంట్ యివ్వడమేంటి" అనుకుని ఆశ్చర్యపోయాడతను.

ఇంతలో, "అసలు మన దేశంలో యిలా అయిపోతుందని కల్లో కూడా అనుకోలేదు. ప్రతీవాడూ స్వార్థమే. అసలు నాది నాది అనే తత్వం మానాలి" అంటూ, "మీరేమంటారు?" అని ఆ పేపర్ ఓనర్ని అడిగాడు, వామనరావ్.

"మీరు చెప్పింది నగ్నసత్యం" అని, పేపర్ అడుగుతే స్వార్థపరుడనుకుంటాడేమోనని, కిటికీలోంచి, చెట్టూ, చేమా చూస్తూ, ఓ విధంగా చూస్తే మనిషికి చివరకు మిగిలేది ఏమిటి అనుకుని, ఓ వెర్రినవ్వు నవ్వుకున్నాడు.


ఆ వెర్రి చూపుల్తోనూ, వెర్రి నవ్వులతోనూ ఓ అర్ధగంట గడిపేశాడతను. ఏమిటిది అని స్పృహలోకొచ్చి తన పేపర్ ఎలాగైనా వాపస్ తీసుకోవాలని, ఆంజనేయస్వామికి దండం పెట్టి, అడిగేద్దామన్న సమయానికి "నీది నీది అనుకున్నది నీది కాదురా!" అంటూ ఓ సినిమా పాట పాడుకుంటూ వచ్చాడు, ఓ కళ్లు లేని కబోది.

కూడగట్టుకున్న ధైర్యం పోగొట్టుకున్న ఆ పేపర్ ఓనర్, "ఆ ముష్టివాడిలా కళ్లు లేకపోయినా బాగుండేది, ఈ వార్తాపత్రిక గొడవలేకపోను!" అనుకున్నాడు.

పేపర్ వాపస్ తీసుకునేలా వున్నాడని గ్రహించిన వామనరావ్, "చూడండి పాపం, ఆ కళ్లు లేని బిచ్చగానికి ఎవ్వరూ దానం చెయ్యటం లేదు. మనుషులు స్వార్థపరులైపోయారు" అన్నాడు.

ఇదంతా జీర్ణించుకోలేని ఆ పేపర్ ఓనర్, "అసలు మంచివాళ్లకే కళ్లు పోతాయ్. అప్పనంగా పేపర్లు తీసుకుని వాపస్ యివ్వకుండా, అదే పనిగా చదివేవాళ్ల కళ్లెందుకు పోవో, తెలియటం లేదు" అనుకున్నాడు.

"చిత్రమైనది విధీ నడక...." అని పాడుకుంటూ వెళ్లిపోయాడు, ఆ బిచ్చ



గాడు.

ఎలాగైనా మంచి చేసుకుని, తన పేపర్ తీసుకుందామన్న ప్రయత్నంలో, "మీరు పేపర్ క్షుణ్ణంగా చదువుతారనుకుంటాను. ఇంగ్లీష్ పేపర్లు కూడా చదువుతారా? ఒక (తెగులేనా అని స్వగతంగా అనుకుంటూ) తెలుగేనా?" అని అడిగాడు, అతను.

"ఇంగ్లీషూ, తెలుగూ అన్నీ చదువుతాను. తెల్లారేసరికి అన్ని పేపర్లూ యింటి దగ్గరికి వచ్చిపడిపోతాయ్. ఈ రోజెందుకో, పేపర్ బోయ్ వేళకి రాలే"దంటూ, మరచిపోయి ఆ సాక్షి పేపర తనికిచ్చేశాడు, వామనరావ్.

వామనరావ్, ఓ ఫ్లాట్‌లో వుంటున్నాడనీ, పొద్దునే అయిదు గంటలకే లేచి, పక్క ఫ్లాట్ ఓనర్స్‌కి సంబంధించిన పేపర్లు, వాళ్లు నిద్ర లేవకముందే చదివేస్తాడని ఈ సహ ప్రయాణికులకెలా తెలుస్తుంది పాపం?

000

ఓ సారి తన సీటు మీద నుంచి లేచి, "వెధవ ప్రయాణాలు" అంటూ, ఒళ్లు విరుచుకుని, కంపార్ట్‌మెంట్‌లో ఎవరి దగ్గరైనా సచిత్ర వారపత్రికలున్నాయోమోనని కలయచూశాడు. ఎక్కడా మచ్చుకైనా ఒక్క వారపత్రిక కనపడలేదు. ఇది పని కాదనుకున్నాడు. ఈ దరిద్రపు "ఎస్ ఎయిట్ కంపార్ట్‌మెంట్ నుంచి మారిపోవాలనుకున్నాడు ఏదో అచ్చిరాని యిల్లు మారిపోవాలన్నట్లు!

"యస్ ఫైవ్"లోకి వెళ్లి ఓ వారపత్రిక చదువుతున్నాయన్ని చూశాడు. "ఇక్కడున్నావా చిట్టితండ్రీ?" అనుకుంటూ, "సార్! ఫలానా సీరియల్ రెగ్యులర్‌గా చదువుతున్నారా?" అని అడిగాడు వామనరావ్.

"ఏం, ఎందుకు?" అన్నాడాయన.

"ఆ ఏం లేదు. ఆ సీరియల్‌లో అరుంధతి, తన భర్తని వదిలేసి వెళ్లిపోయిందా లేక యింకా అతనితోనే వుందా-అన్న విషయం ఏమైనా ఈ వారం రచయిత తెలియపరచాడా, అని."

"నేనింకా చదవలేదు."

"నాకీ విషయం గురించి చాలా ఆదుర్దాగా వుంది. పత్రిక ఒక్క సారి యిస్తారా?"

"పోనీ యివ్వండి. మనిషి మంచివాడిలా వున్నాడు" అంది. పక్కనున్న అతని శ్రీమతి.

పత్రిక తీసుకుంటూ, "యింత మంచి భార్యను పొందిన బావ గారు చాలా అదృష్టవంతులు" అన్నాడు, వామనరావ్.

"ఆ! యిదెంత రాక్షసో, యింట్లో నన్నెంత బాధపెడుతుందో. నీకేం తెలుసు?" అనుకున్నాడాయన.

ఓ అరగంట తరువాత, టికెట్ ఇన్స్‌పెక్టర్ వచ్చి వామనరావ్ టిక్కెట్ చూసి, మీరు "ఎస్ ఎయిట్‌లో కదా కూర్చోవాలి? ఎస్ ఫైవ్‌కి ఎందుకు వచ్చారు?" అన్నాడు.

"ఏం చెయ్యమంటారు సార్? అక్కడ దినపత్రికలే కాని, వారపత్రికలు లేవు. ఎంతసేపని వూరికే ఏం చదవకుండా కూర్చుంటాను? అక్కడకీ, కూల్ డ్రింక్స్ అమ్మే అతన్నీ, స్నేక్స్ అమ్మే అతన్నీ, ఒక్క వారపత్రికైనా సంపాదించి తెమ్మన్నాను. ఏదీ వాళ్లు సహకరిస్తేగా? ఏమిటో ప్రయాణీకుల సుఖప్రయాణం గురించి పట్టించుకునేవారే లేరు. అసలు ప్రతీ ప్రయాణికుడికి, టిక్కెట్‌తో పాటు, ఓ దినపత్రిక, ఓ వారపత్రికా యిస్తే, మీ సొమ్మేం పోతుందని, ఓ బాధ్యాతాయుత పౌరుడుగా సూటిగా మిమ్మల్ని అడుగుతున్నాను" అన్నాడు, వామనరావ్.

"అనవసరమైన విషయాలు మాట్లాడకండి! టిక్కెట్‌తో పత్రికలు అప్పనంగా యిస్తే గవర్నమెంట్‌కి నష్టం వస్తుంది" అన్నాడు ఇన్స్‌పెక్టర్.

"పోన్లెండి ఆ విషయం వదిలెయ్యండి! "ఎయిట్" కంటె "ఫైవ్" తక్కువ కదా! తక్కువ కంపార్ట్‌మెంట్‌లో కూర్చుంటే మీకభ్యంతరమేమిటి!" అన్నాడు, వామనరావ్.

దినపత్రికలే కాని, వారపత్రికలు లేవు. ఎంతసేపని వూరికే ఏం చదవకుండా కూర్చుంటాను? అక్కడకీ, కూల్ డ్రింక్స్ అమ్మే అతన్నీ, స్నేక్స్ అమ్మే అతన్నీ, ఒక్క వారపత్రికైనా సంపాదించి తెమ్మన్నాను. అదీ వాళ్లు సహకరిస్తేగా? ఏమిటో ప్రయాణీకుల సుఖప్రయాణం గురించి పట్టించుకునేవారే లేరు. అసలు ప్రతీ ప్రయాణికుడికి, టిక్కెట్‌తో పాటు, ఓ దినపత్రిక, ఓ వారపత్రికా యిస్తే, మీ సొమ్మేం పోతుందని, ఓ బాధ్యాతాయుత పౌరుడుగా సూటిగా మిమ్మల్ని అడుగుతున్నాను" అన్నాడు, వామనరావ్.
"అనవసరమైన విషయాలు మాట్లాడకండి! టిక్కెట్‌తో పత్రికలు అప్పనంగా యిస్తే గవర్నమెంట్‌కి నష్టం వస్తుంది" అన్నాడు ఇన్స్‌పెక్టర్.

"వీడేదో పెద్ద తిక్కశంకరయ్యలా వున్నాడు," అనుకుంటూ "మాట్లాడదాం! చెకింగ్ అయిన తరువాత మళ్లీ వస్తాను!" అని ముందుకు సాగిపోయాడాయన.

"అసలు మనుషుల్ని అనవసరంగా ఎందుకు బాధపెడతారో , యీ అధికారులు?" అంటూ, "చెల్లెమ్మా మూడు వారాల క్రిందటి వారపత్రిక వుంటే యి"వ్వమన్నాడు వామనరావ్.

"అయ్యో, అదేం పెద్ద భాగ్యం! ఈ సీరియల్ మొదలైనప్పటి నుంచీ వచ్చిన వారపత్రికలు నా పెట్లో పెట్టి భువనేశ్వర్‌లో వున్న మా చెల్లెలి చేత చదివిద్దామని తీసుకెడుతున్నా" అంటూ, అతనడిగిన వారపత్రిక తీసి యిచ్చింది.

ఈ లోపులో కోపంతో వచ్చిన ఇన్స్‌పెక్టర్, "ఊఁ ఎస్ ఎయిట్‌కి నడవండి!" అని వామనరావ్‌ని తన కూడా తీసుకొచ్చి, ఎస్ ఎయిట్‌లో కూలేశాడు.

కాస్సేపయిన తరువాత, ఆ వారపత్రిక యిచ్చినావిడ, "అన్నయ్య గారూ! యీ పత్రికలో ఏదైనా తెల్ల కవర్ వుందా?" అంటూ వచ్చింది.

"లేదండీ!" అన్నాడు వామనరావ్.

"అయ్యో! ఆ కవర్లో రెండు వేల రూపాయలు మా చెల్లిలికి యిద్దామని పెట్టానండీ!" అని కళ్ల నీళ్లు పెట్టుకుంది.

ఈ లోపులో ఎస్ ఫైవ్‌కి వచ్చిన ఇన్స్‌పెక్టర్, విషయం తెలుసుకుని. ఖమ్మం స్టేషన్లో వామనరావ్‌ని రైల్వే పోలీసులకి అప్పచెప్పాడు.

"ఎందుకు సార్, వదిలెయ్యకపోయారా?" అన్నారు ప్రయాణికులు.

"ఇందాకా యీయన ఎస్ ఫైవ్‌లో చాలా అడ్డదిడ్డంగా మాట్లాడాడు, నాతో. టికెట్‌తో పాటు పత్రికలు అప్పనంగా యివ్వాలట పైగా, ఫైవ్ ఎక్కువా ఎయిట్ ఎక్కువా-అని అడిగాడు!"

ఇవ్వన్నీ విన్న ప్రయాణికులు అవాక్కయిపోయారు. కొంత మందైతే, వాడికి యీ శాస్తి అవ్వవల్సిందే అనుకున్నారు.

●